నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
13 | హైదరాబాద్, మంగళవారం 30 జనవరి 2024 | RANGAREDDY

బీఆర్ఎస్ విజయం ఖాయం
– పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ

ఎన్నికలు ఏవైనా బీఆర్ఎస్ గెలుపు కోసం అందరూ కలిసికట్టుగా కృషి చేయాలి. చేవెళ్ల ఎంపీగా రంజిత్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉన్నది. కేటీఆర్ సహకారంతో షాబాద్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందింది. దేశ, విదేశాలకు చెందిన పలు కంపెనీలు ఇక్కడ ఏర్పాటు కావడంతో స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు లభించాయి. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయం. రాష్ట్రాభివృద్ధి కేసీఆర్‌తోనే సాధ్యం.

- ప్రతి పోలింగ్ బూత్‌నుంచి సోషల్ వారియర్లు తయారు కావాలి
- ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి వీడియోలు తీసి గ్రూపుల్లో పెట్టాలి
- 'కారు' సర్వీసింగ్ పూర్తయితే.. ఆ వేగాన్ని ఎవ్వరూ అందుకోలేరు..
- కరెంటు కోతలు ప్రారంభమైనయ్..
- ఎరువుల దుకాణాల ముందు క్యూలైన్లు పెరిగినయ్..
- ఆటోడ్రైవర్లు, అన్నదాతలు ఆగమైతున్నరు..
- బలమైన ప్రతిపక్షంగా ప్రజల పక్షాన పోరాడుదాం...
- చేవెళ్ల, పరిగి అసెంబ్లీ నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సమావేశంలో మాట్లాడుతున్న పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

చేవెళ్లలోని సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పక్కన ఎంపీ రంజిత్‌రెడ్డి

హామీలపై నిలదీద్దాం

ప్రశ్నించే గొంతుకను గెలిపించుకుందాం.. రంజిత్‌రెడ్డి విజయం కోసం అందరం కృషి చేద్దాం..

షాబాద్, జనవరి 29 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తేనే తెలంగాణ కు న్యాయం జరుగుతుందని.. కాంగ్రెస్, బీజేపీ డూడూ బసవన్నలను ఢిల్లీకి పంపితే తీవ్ర నష్టమేనని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. సోమవారం రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల కేజీఆర్ గార్డెన్‌లో..అదేవిధంగా వికారాబాద్ జిల్లాలోని పరిగిలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డిలతో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేవెళ్ల ఎంపీగా రంజిత్‌రెడ్డిని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆశీర్వదించి మీ దగ్గరికి పంపిస్తే నేడు ఆయన అందరివాడుగా.. ఆప్తబంధువుడిలా జనం మధ్యలోనే ఉంటున్నారన్నారు. పరిగిలో మహేశ్‌రెడ్డిని ఓడించినందుకు రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీకారం తీర్చుకోవాలని, రానున్న ఎన్నికల్లో కారు దూసుకెళ్లాలని.. రంజిత్‌రెడ్డిని బ్రహ్మాండమైన మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్‌రెడ్డి గెలుస్తారనే నమ్మకం ఉండేదని.. కులకచర్లలో ఎన్నికలప్పుడు వచ్చినప్పుడు ఆ ఊపు, జోష్‌ను నా కండ్లారా చూశానని.. కేసీఆర్ పరిగికి వచ్చినప్పుడు కూడా చాలా బాగుందని చెప్పారని, ఆ విశ్వాసంతోనే మహేశ్‌రెడ్డికి మీరు గెలుస్తున్నారని చెప్పినట్లు తెలిపారు. ప్రజలు మనకు 39 సీట్లు ఇచ్చి బలమైన ప్రతిపక్షంగా ఉండాలని ఆశీర్వదించారన్నారు. 14 ఏండ్లపాటు కారు బ్రహ్మాండంగా ఉద్యమంలో పరుగులు తీసింది.. ఆ తర్వాత తెలంగాణలోని ప్రతి గల్లీలోనూ ఉరికింది.. 24 ఏండ్ల పాటు 100 స్పీడులో పరుగులు పెట్టి ఇప్పుడు కొన్ని రోజులు మాత్రమే సర్వీసింగ్‌కు వెళ్లిందన్నారు. అన్ని సెట్ చేసుకుని చేవెళ్ల హైవే ఎక్కిన తర్వాత పార్లమెంట్ ఎన్నికల్లో వంద స్పీడ్‌తో దూసుకెళ్లాలని ..చేవెళ్ల ఎంపీగా రంజిత్‌రెడ్డిని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించుకుందామని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. మార్పు అనేది అప్పుడే ప్రారంభమైనదని.. దొంగ మాటలు నమ్మి కేసీఆర్‌ను పోగొట్టుకున్నామని అన్ని వర్గాల వారు బాధపడుతున్నారన్నారు. పరిగిలో మహేశ్‌రెడ్డి నాయకత్వంలో బలమైన ప్రతిపక్షంగా ముందుకు పోదామన్నారు. పరిగిలో అసెంబ్లీ ఎన్నికల్లో మోసం జరిగిందని, పార్లమెంట్ ఎన్నికల్లో దానిని సరి చేసుకోవాలని కేటీఆర్ సూచించారు. ఇప్పటికే రాష్ట్రంలో కరెంటు కోతలు ప్రారంభమయ్యాయని, ఎరువులు, విత్తనాల షాపుల ఎదుట లైన్లు కనబడుతున్నాయని పేర్కొన్నారు. ఉచిత బస్సుల కారణంగా ఆటో డ్రైవర్లు రోడ్డుపై పడ్డారని.. రైతుబంధు నిధులు సకాలంలో జమ కాకపోవడం తో రైతులు పంటలను సాగు చేసుకోలేకపోతున్నారని ఆరోపించారు. రైతు భరోసా దేవుడెరుగు...కేసీఆర్ ప్రభు త్వం ఇచ్చినట్లు రూ.10 వేల చొప్పున కూడా అందించలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. మార్చి 17 తేదీతో కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తవుతుందని.. అప్పటివరకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే పోరాటం చేస్తామన్నారు. గ్రామాల్లో రైతుల కష్టాలు, మహిళల బాధలు, రూ.4వేల పింఛన్ సక్రమంగా పంపిణీ కాకపోవడంతో అన్ని వర్గాల వారు బాధపడుతున్న వీడియోలు తీసి వాట్సాప్ గ్రూపుల్లో పెట్టడం ద్వారా పార్లమెంటు నియోజకవర్గ మంతా చైతన్యవంతమవుతుందన్నారు. ప్రతి బూత్ నుంచి సోషల్ వారియల్ కావాలన్నారు.

చేవెళ్ల ప్రాంతంలో ఏర్పాటు చేసిన వివిధ కంపెనీలతో భూముల ధరలకు రెక్కలొచ్చాయన్నారు. తెలంగాణ వస్తే భూముల ధరలు పడిపోతాయని అప్పట్లో ఎంతోమంది మాట్లాడారని.. కానీ ఇప్పుడు కోట్లల్లో పలుకుతున్నాయన్నారు. బీజేపీతో దేశానికి, రాష్ట్రానికి ఒరిగేమీలేదన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలోని ఐటీఐఆర్ ప్రాజెక్టును రద్దు చేసింది బీజేపీ ప్రభుత్వమేనని, ఐటీఐఆర్ రద్దుపై ఎంపీ రంజిత్‌రెడ్డి పలుమార్లు ప్రశ్నించినా బీజేపీ ప్రభుత్వం స్పందించలేదని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ గొంతు పార్లమెంట్‌లో వినబడాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులను లోక్‌సభకు పంపించాలన్నారు. ఈ ప్రాంతానికి అన్యాయం జరుగుతుంటే లోక్‌సభలో గట్టిగా మాట్లాడిన రంజిత్‌రెడ్డి మీ అండగా ఉన్నారన్నారు. పార్టీలో ఉన్న నాయకులను సమన్వయం చేయడంలో కొంత లోపం జరిగిన మాట వాస్తవవేనని, భవిష్యత్తులో ఆ లోటును పూడ్చే బాధ్యతను తాను తీసుకుంటానని ..కార్యకర్తలు, నాయకులు చిన్న, చిన్న వ్యక్తిగత విభేదాలను పక్కన పెట్టి కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. రాబోవు రోజుల్లో ఒక దాని తర్వాత మరిన్ని ఎన్నికలు ఉన్నాయని, పార్లమెంట్ ఎన్నికల్లో పునాదిని బలంగా వేద్దామన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీలు గోవర్ధన్‌రెడ్డి, గునుగుర్తి నక్షత్రం, ఎంపీలు కరణం అరవిందరావు, మల్లేశం, జడ్పీటీసీలు పట్నం అవినాశ్‌రెడ్డి, మాలతి, నాగారెడ్డి, హరిప్రియ, మేఘమాల, రాందాస్ నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్, మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, పరిగి పీఏసీఎస్ చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి,

రంగారెడ్డి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు స్వప్న, తెలంగాణ ఉద్యమకారుడు దేశమళ్ల ఆంజనేయులు, చేవెళ్ల మార్కెట్ కమిటీ చైర్మన్ మిట్టా వెంకటరంగారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొంపల్లి అనంతరెడ్డి, కొప్పుల అనిల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు ప్రభాకర్, నర్సింగ్‌రావు, ఆంజనేయులు, మహేందర్‌రెడ్డి, గోపాల్, వాసుదేవ్‌కన్నా, పెంటారెడ్డి, వెంకటయ్య, నర్సింహారెడ్డి, రాజేందర్ గౌడ్, లక్ష్మీకాంత్‌రెడ్డి, మల్లేశ్, శ్రీరాంరెడ్డి, గిరిధర్‌రెడ్డి సురేందర్, రాజేందర్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, హరికృష్ణ, గోపాల్‌రెడ్డి, సుభాష్‌చందర్ రెడ్డి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పై వ్యతిరేకత మొదలైంది..

ప్రజలతో నిత్యం మమేకమయ్యే రంజిత్‌రెడ్డితోనే చేవెళ్ల పార్లమెంట్ ప్రజలకు మేలు జరుగుతుంది. ఆయన అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటూ సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది. గ్రామాలకెళ్తే హస్తం పార్టీని నమ్మి మోసపోయా మనే బాధ కనిపిస్తున్నది. ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు పెట్టింది పేరు ఆ పార్టీ. పూడూరులో ఏర్పాటు చేయనున్న రాడార్ కేంద్రంతో స్థానికులకు ఉద్యోగాలు వస్తాయనే భ్రమను కల్పిస్తున్నది. 2009లోనే రాడార్ కేంద్రం ఏర్పాటు ప్రతిపాదన రాగా.. కేసీఆర్ దాన్ని పక్కన పెట్టారు. రాడార్ కేంద్రం ఏర్పాటుతో వెలువడే రేడియేషన్‌తో ప్రజలు, పక్షులు, జీవరాశులకు ముప్పు జరుగుతుంది.

– మెతుకు ఆనంద్, బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు

చేవెళ్ల నుంచి ఏ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఘన విజయమే
–పట్లోళ్ళ కార్తీక్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు

రామన్న మీరు అనుకుని వచ్చారో...అనుకోకుండా వచ్చారో తెలియదు గానీ.. చేవెళ్ల నుంచి ఏ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినా.. ఏ పార్టీ వారు చేపట్టినా పెద్ద విజయమే సాధించింది. ఈ రోజు మీరు చేపట్టిన ఈ కార్యక్రమం కూడా అదే విధంగా ఘనవిజయం సాధిస్తుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంత నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ గాలి వీస్తే.. చేవెళ్ల నియోజకవర్గంలో మాత్రం కారు గుర్తు జయభేరి మోగించింది. ప్రజలందరూ బీఆర్ఎస్ పార్టీకి అండగా ఉన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో రంజిత్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించి లోక్‌సభకు పంపిస్తే మన సమస్యలపై పోరాడుతారు. మనకు అండగా ఉంటారు. కేటీఆర్ నాయకత్వంలో పనిచేసి మరోసారి గులాబీ జెండాను తెలంగాణలో అధికారంలోకి తీసుకొద్దాం.

ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి
–గడ్డం రంజిత్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ

రానున్న ఆరు నెలల వరకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే కాలె యాదయ్య గెలుపునకు కార్యకర్తలు ఎంతో కష్టపడ్డారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వారు గెలిచినంత మాత్రనా వారు రాజులు కాదు, మనం బంటులం కాదు. ఎన్నికల్లో గెలుపోటములు సహజం. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదిస్తే మీకు అండగా ఉండి.. బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేస్తా. పదేండ్లకాలంలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ప్రగతిపథంలో నిలిపిన ఘనత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కే దక్కింది. తెలంగాణను ఐటీ రంగంలో ముందు వరుసలో నిలపడంలో మాజీ మంత్రి కేటీఆర్ ఎంతో కృషి చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసేవరకూ బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు మద్దతుగా పోరాడుతూనే ఉంటుంది. ఇప్పటికీ రైతుబంధు నిధులు జమ కాకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో సీజన్‌కు ముందే వారం రోజుల్లో రైతుబంధు డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అయ్యేవి. దమ్ముంటే ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలి. ప్రస్తుతం రాష్ట్రంలో కరెంట్ ఎప్పుడు వస్తుందో...ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. ఫిబ్రవరి 1న కేసీఆర్ ప్రజల్లోకి రాగానే అసెంబ్లీలో ప్రతిపక్షనేతగా సమస్యలపై పోరాటం చేస్తాం. మాజీ మంత్రి కేటీఆర్ సహకారంతో షాబాద్, శంకర్‌పల్లి మండలాల్లో పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. పదేండ్లలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందాయి. రాబోవు ఆరు నెలలు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేసి కాంగ్రెస్ ఇచ్చిన దొంగ హామీలను ప్రజలకు వివరించారు. పూడూరులో లోఫ్రీక్వెన్సీ రాడార్ కేంద్రం ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్సాహాన్ని చూపుతున్నది.. పూడూరు గ్రామస్తులు వద్దంటున్నా పట్టించుకోవడం లేదు. గతంలో తాను, మహేశ్‌రెడ్డి వెళ్లి రాడార్ కేంద్రాన్ని ఆపాలని కేసీఆర్‌ను కోరగా పదేండ్లు ఆపారు.. కానీ కాంగ్రెస్ వచ్చి రాగానే రాడార్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నది.

ప్రజల తరపున పోరాడుదాం..

కేసీఆర్ హయాంలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు మార్పును కోరుకున్నారు. ప్రజాతీర్పును గౌరవిద్దాం. ఓడిపోయినంత మాత్రనా కుంగిపోవద్దు. పార్టీని మరింత బలోపేతం చేద్దాం. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో రంజిత్‌రెడ్డిని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించుకుందాం. పార్లమెంట్ ఎన్నికలతోపాటు ఆ తర్వాత జరుగనున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నది. పరిగి నియోజకవర్గంలో గత నలభై ఏండ్లుగా స్థానిక సంస్థల్లో మనమే మెజారిటీ స్థానాలను సాధించాం. ఆ పరంపరను ఇప్పుడూ కొనసాగిద్దాం. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలయ్యేవరకూ ప్రజల తరపున పోరాడుదాం.

– మహేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే, పరిగి

చేవెళ్ల సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

డీపీఎంఎస్ పొడిగింపు
హెచ్ఎండీఏ పరిధిలో మరో 2 నెలలు అందుబాటులో..

సిటీబ్యూరో, జనవరి 29 (నమస్తే తెలంగాణ): భవన నిర్మాణ అనుమతుల్లో ఒకే విధానాన్ని అమలు చేసేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ చర్యలు చేపట్టింది. గ్రేటర్ చుట్టూ ఉన్న ఔటర్ రింగు రోడ్డు లోపల, బయట హెచ్ఎండీఏ పరిధిలోని 40 మున్సిపాలిటీలు ఉండగా, గ్రామాలు 719 వరకు ఉన్నాయి. ముఖ్యంగా ఔటర్ రింగు రోడ్డు లోపల సైతం హెచ్ఎండీఏ పరిధిలో కొన్ని గ్రామాలు ఉన్నాయి. ఇక్కడ భారీ ఎత్తున రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు జరుగుతున్నాయి. భవన నిర్మాణ అనుమతుల్లో జాప్యం వస్తుండడంతో అక్రమ కట్టడాలు గణనీయంగా పెరుగుతున్నాయి. గ్రామ పంచాయతీలకు జీ ప్లస్ 2 వరకే అనుమతి ఇచ్చే అవకాశం ఉండడంతో కొందరు 3,4,5 అంతస్తులతో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన హెచ్ఎండీఏ పూర్తి స్థాయిలో టీఎస్ బీపాస్‌ను గ్రామాల్లో అమలు చేయాలని ప్రభుత్వానికి సూచించింది. ఇందుకు అనుగుణంగానే హెచ్ఎండీఏ పరిధిలో పూర్తి స్థాయిలో టీఎస్ బీ పాస్ ద్వారానే అనుమతులు ఇచ్చేందుకు వీలుగా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించే పనిని ఐటీ కన్సల్టెన్సీలకు అప్పగించారు. ఇదిలా ఉంటే... సోమవారం హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్ ఆమ్రపాలి అధ్యక్షతన ఇద్దరు ప్లానింగ్ డైరెక్టర్లు, 4 ప్లానింగ్ ఆఫీసర్స్‌తో పాటు సాఫ్ట్‌వేర్ అప్లికేషన్స్ రూపొందించే ఐటీ నిపుణులతో ప్రత్యేకంగా చర్చించారు. 2 నుంచి 3 నెలల వ్యవధిలో డీపీఎంఎస్‌ను పూర్తి స్థాయిలో టీఎస్ బీపాస్ పరిధిలోకి తీసుకొచ్చేలా సాఫ్ట్‌వేర్ అప్లికేషన్‌ను రూపొందిస్తామని ఐటీ నిపుణులు పేర్కొన్నారు. ఇందుకు అనుగుణంగానే హెచ్ఎండీఏ పరిధిలోని గ్రామాల ప్రజల సౌకర్యం కోసం డీపీఎంఎస్‌ను 2-3నెలల పాటు కొనసాగించాలని, ఫిబ్రవరి 5న మరోసారి సమావేశమవ్వాలని నిర్ణయించారు.

మర్పల్లి మీదుగా తిరుపతికి పూర్ణ-తిరుపతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్

మర్పల్లిలో రైలుకు పూజలు చేస్తున్న ప్రజలు

మర్పల్లి, జనవరి 29 : మర్పల్లి మీదుగా పూర్ణ-తిరుపతి వెళ్లే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును రైల్వే అధికారులు సోమవారం నుంచి మర్పల్లిలో హాల్ట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైల్వే సాధన సమితి సభ్యులు రైలుకు పూజలు చేసి మాట్లాడుతూ ప్రతి సోమవారం సాయంత్రం 5.19 గంటలకు బయలుదేరుతుందన్నారు.. మర్పల్లిలో హాల్ట్ ఏర్పాటు చేసినందుకు రైల్వే అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.. తిరుపతి పుణ్యక్షేత్రానికి వెళ్లే యాత్రికులకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు..

మూగజీవాలను రక్షించాలి
కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, జనవరి 29 : వికారాబాద్ దేశ వ్యాప్తంగా జంతు సంరక్షణ పక్షోత్సవాలు ఈనెల 14 నుంచి 30 వరకు జరుపుకొంటున్న సందర్భంగా కలెక్టర్, అదనపు కలెక్టర్ల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పశు వైద్య, పశు సంవర్ధక అధికారి, ఆయా జిల్లా అధికారులతో కలిసి జంతు సంరక్షణ పక్షోత్సవాల కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ జంతు హింసకు పాల్పడకుండా, కరుణతో ఉంటూ వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జిల్లాలో జంతు సంరక్షణకు సేవచేయు వారికి , స్వచ్ఛంద సంస్థలకు ప్రతి పౌరుడు సహకరించాలన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడాలని, వన్యప్రాణులు కనిపించినట్లయితే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చి సహకరించాలని సూచించారు. పక్షులు నివసించే ఆవాసాలైన వృక్షాలను నరకరాదని, అదేవిధంగా పశువులు, జంతువులను రవాణా చేసే క్రమంలో తప్పనిసరిగా జంతు రవాణా నిబంధనలను పాటించాలన్నారు. వీధుల్లో తిరిగే కుక్కలు, పిల్లులు, ఆవులు తదితర జంతువులపై కరుణతో వ్యవహరించి వాటికి ఆహారం, తాగునీరు అందించాలని తెలిపారు. పెంపుడు జంతువులను అమ్ముట, కొనుట వాటి సంతాన అభివృద్ధి (బ్రీడింగ్) చేయడం ద్వారా వ్యాపారం చేయువారు తప్పని సరిగా జంతు సంరక్షణ బోర్డు నుంచి రిజిస్ట్రేషన్ పొందాలని సూచిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే శిక్షార్హులు అవుతారన్నారు. ప్రజలు ప్లాస్టిక్ కవర్లను వాడకూడదన్నారు. వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో జంతు సంరక్షణ, సంక్షేమంపై నిర్వహించిన వ్యాస రచన పోటీలో గెలుపొందిన 6, 7, 8, 9, 10వ తరగతి విద్యార్థులకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ, వికారాబాద్ జిల్లా తరపున స్కూల్ విద్యార్థులకు జంతు సంరక్షణపై అవగాహన కల్పించారు. జామూన్, వేప, రావి ఇతర మొక్కలను నాటాలన్నారు. ప్రతి పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబీస్ వ్యాధి నిరోధక టీకాలు వేస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యా నాయక్, పశుసంవర్ధక శాఖ అధికారి అనిల్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జంతు సంరక్షణ పక్షోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

తల్లిదండ్రుల పూజోత్సవం

షాబాద్‌లో అమ్మానాన్నలకు పూజలు చేస్తున్న విద్యార్థులు

షాబాద్, జనవరి 29 : మండల కేంద్రంలోని పీఆర్ఆర్ స్టేడియంలో సోమవారం సంత్‌శ్రీ ఆశారామ్‌జీ ఆశ్రమం శంషాబాద్ ఆధ్వర్యంలో అమ్మానాన్న పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పూజలు చేశారు. తల్లిదండ్రులను మరువకూడదని బాపూజీ భక్తులు ఈ కార్యక్రమంతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అందరి హృదయాలు పవిత్ర భావంతో నిండిపోయాయి. పూజ చేసేటప్పుడు తల్లిదండ్రులు, పిల్లల కండ్లల్లో నీళ్లు తిరిగాయి. ఎంతో కనువిందైన దృశ్యాలు కనిపించాయి. దేశవ్యాప్తంగా పాఠశాలలు, సొసైటీలు, గ్రామాలు, ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సంత్‌శ్రీ తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

జిల్లాలో సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి

ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, జనవరి 29 : జిల్లాలోని ప్రజలు సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని వికారాబాద్ జిల్లా ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి సోమవారం తెలిపారు. జిల్లాలో సైబర్ నేరాలను తగ్గించాలనే సంకల్పంతో జిల్లాలో సైబర్ సెక్యూరిటీ వింగ్‌ను మరింత పటిష్టం చేశామన్నారు. జిల్లా సైబర్ సెక్యూరిటీ వింగ్ ఇన్‌చార్జి డీఎస్పీ హనుమంత్‌రావు, ఇన్స్పెక్టర్ వీరప్రసాద్‌ల ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్‌లోనూ సైబర్ క్రైం కేసుల్లో అధికారులకు సహాయంగా సైబర్ వారియర్లను ఏర్పాటు చేశామన్నారు. సైబర్ క్రైం జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలు తదితర విషయాలను ప్రజలకు వివరిస్తున్నామని తెలిపారు. తక్కువ పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు వస్తాయి అని, ఆన్‌లైన్‌లో వస్తువులు తక్కువ ధరకు వస్తాయని, ఆన్‌లైన్ లోన్ ఫ్రాడ్స్ ఇలా రకరకాలుగా సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసాలు చేస్తున్నారన్నారు. దయచేసి ప్రజలు సైబర్ నేరస్థుల వలలో పడకూడదన్నారు. సైబర్ నేరగాళ్ల బారినపడితే వెంటనే 1930 నంబర్‌కి లేదా www.cybercrime.gov.in వెబ్ సైట్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ పేర్కొన్నారు.